
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



కొబ్బరి చెక్కల ఆదాయం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కొబ్బరి చెక్కల వేలంలో రూ.1.35 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆగంటి ప్రభాకరరావు సోమవారం తెలిపారు.



కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4,900,మధ్య డెల్టాకు 2,600,పశ్చిమ డెల్టాకు 7,500క్యూసెక్కుల నీటిని వదిలారు.

యశస్వీభవ



ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం యశస్వి) పథకం అమలు చేస్తోంది. IIలో..

న్యూస్‌రీల్

అర్జీదారుల సమస్యలు నాణ్యతతో పరిష్కరించాలి



స్పందనలో సమస్య వింటున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నాణ్యతను పెంచడం అనేది ప్రధాన లక్ష్యం కావాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి సుమారు 238 అర్జీలను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారునికి సంతృప్తికర స్థాయిలో పరిష్కార మార్గాలు పూర్తిగా చూపాలన్నారు. వ్యక్తిగత ఫిర్యాదులు, కుటుంబ స్థాయిలో వచ్చే ఫిర్యాదులను నమోదు చేసిన తర్వాత నిర్ణీత వ్యవధిలో పరిష్క రించాలన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా, ఒకసారి అందిన దరఖాస్తు మళ్లీ రీఓపెన్ కాకుండా అధికారులు జాగ్రత్తలు వహించాలన్నారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 20 అర్జీలు



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 20 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యలను స్వయంగా విన్నవించుకుని పరిష్కారం కోసం అభ్యర్థించారు. ఓ దివ్యాంగుడు పై అంతస్తులో ఉన్న ఎస్పీ చాంబర్‌కు వచ్చే వీలు లేకపోవడంతో ఎస్పీ శ్రీధర్ గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళ్లి మాట్లాడారు. అతని నుంచి ఫిర్యాదు పత్రాన్ని తీసుకుని న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. వచ్చిన 20 అర్జీల్లో సగానికి పైగా ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలే ఉన్నాయి. ఎస్పీ కార్యాలయ స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీ కుమార్, డీసీఆర్‌బీ ఎస్సై గంగా భవాని పాల్గొన్నారు.

400 అడుగుల త్రివర్ణ పతాకం ప్రదర్శన



అమలాపురంలో ప్రదర్శించిన 400 అడుగుల త్రివర్ణ పతాకం

అమలాపురం టౌన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ కా తిరంగ్ కార్యక్రమంలో భాగంగా అమలాపురం గొల్లగూడెం ఆదిత్య పాఠశాల విద్యార్థులు 400 అడుగుల త్రివర్ణ పతాకాన్ని సోమవారం పుర వీధుల్లో ప్రదర్శించారు. విద్యార్థులు జాతీయ భావంతోపాటు దేశభక్తిని కూడా చాటుతూ స్వాతంత్య్ర దినోత్సవ స్ఫూర్తితో నినాదాలు చేశారు. ఈ త్రివర్ణ పతాక ప్రదర్శన గొల్లగూడెం స్కూలు నుంచి మొదలై గొల్లగూడెం బైపాస్ రోడ్డు, హైస్కూలు రోడ్డు మీదుగా గడియారం స్తంభం సెంటరుకు చేరుకుంది. ప్రదర్శనకు ముందు కొందరు విద్యార్థులు జాతి నేతల వేషధారణల్లో అలరించారు. 400 అడుగుల త్రివర్ణ జెండాను విద్యార్థులు ప్రదర్శిస్తూనే చేసిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన స్కూలు ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగింది.

చిత్తశుద్ధి రాగంలో... ప్రగతి పల్లవి



"గ్రామాలు బాగుంటేనే... దేశం బాగుటుంది"
- మహాత్మాగాంధీ

- మహాత్ములు కలలు కన్న దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు
- గాంధీ కోరుకున్న గ్రామ స్వరాజ్యం కోసం
- సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు

గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, అంబేడ్కర్ ఆశించిన అందరికీ విద్య అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. పల్లె ప్రజల అవసరాలు అక్కడే తీరాలా గ్రామాలను ఈ ప్రభుత్వం పునర్నిర్మిస్తోందంటే అతిశయోక్తి కాదు. నవరత్న పథకాలు, నవ్యమైన ఆలోచనలతో ప్రగతిని ఆవిష్కరించే వివిధ కార్యక్రమాలను అమలు చేస్తూ అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తోంది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయమైన ఆచరణతో, జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రశంసలతో దూసుకుపోతోంది. పల్లెకు పట్టం గట్టి, విద్యకు పెద్ద పీట వేస్తున్న సుపరిపాలనపై స్వాతంత్య్రం దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

సాక్షి అమలాపురం: మహాత్మాగాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వలంటీర్ వ్యవస్థ, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీలు.. ఇలా అన్ని వర్గాలకు.. వివిధ సేవలు గ్రామాల్లోనే అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

సచివాలయాలు

జిల్లాలో 515 సచివాలయాలు ఉండగా, వీటి ద్వారా 546 సేవలందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఏపీ సేవా పోర్టల్ ద్వారా ఆధార్, రేషన్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డుల్లో మార్పులు చేర్పులు, పింఛన్‌ల బదిలీ, భూముల సర్వేలకు అర్జీలు, కుల, ఆదాయ, వన్- బి పాస్ పుస్తకాలతోపాటు ఓటీసీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఎంసీ), రేషన్ కార్డులలో మార్పులు, చిరునామా మార్పులు, లేబర్ సర్టిఫికెట్ వంటివి అందజేస్తున్నారు. ఐఆర్‌సీటీసీ ద్వారా గత ఏడు నెలలుగా రైల్వే టిక్కెట్లు తీసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. వీటిలో స్పందన అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తున్నారు. జగనన్న సురక్షలో జిల్లా వ్యాప్తంగా 7,65,694 సమస్యలను పరిష్కరించారు. జిల్లాలో 67 సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. జిల్లాలో కొత్తగా 437 సచివాలయాల నిర్మాణాలు చేపట్టగా 210 పూర్తి కాగా, 227 నిర్మాణ దశలో ఉన్నాయి.

రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు)

జిల్లాలో 377 రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేశారు. వీటి ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచారు. మట్టి, నీటి నమూనాల పరీక్షలతోపాటు ట్రాక్టర్‌లు, ట్రిల్లర్ వంటి యంత్రాలను రాయితీలపై అందిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా నేరుగా ధాన్యం కొనుగోలు చేయడం వల్ల కనీస మద్దతు ధరకు ఢోకా లేకుండా ఉంది. విలేజ్ అగ్రికల్చర్, లేదా విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్, విలేజ్ వెటర్నరీ లేదా ఫిషరీస్ అసిస్టెంట్ అందుబాటులో ఉంటూ రైతులకు సూచనలు చేస్తున్నారు. పంట నష్టపోయిన వెంటనే పరిహారం అందుతోంది అంటే క్షేత్రస్థాయిలో వీరి సేవలే కారణం. జిల్లావ్యాప్తంగా 377 ఆర్బీకేలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 86 వరకు నిర్మాణం పూర్తి చేయగా, ఇంకా 291 నిర్మాణ దశల్లో ఉన్నాయి.



కొత్తపేట మండలం వాడపల్లి రైతు భరోసా కేంద్రం



అమలాపురం మండలం ఈదరపల్లి సచివాలయంలో కుల ధ్రువీకరణ పత్రాల పంపిణీ (ఫైల్)

హెల్త్ క్లినిక్‌లు

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలతో గ్రామాల్లో సత్వర వైద్యం అందుతోంది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంట్లో మంచం మీద ఉన్న రోగులకు వద్ద కు వెళ్లి వైద్యం అందజేస్తుండగా, గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల వద్దకు వచ్చి వైద్యులు ఓపీ నిర్వహిస్తుండడం వల్ల పేద రోగులకు మేలు జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 296 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు చేపట్టగా ఇప్పటి వరకు 48 పూర్తయ్యాయి. 248 నిర్మాణ దశలో ఉన్నాయి. వీటితోపాటు గ్రామాల్లో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు, ఆక్వా ల్యాబ్‌ల నిర్మాణాల ద్వారా ప్రభు త్వం పాడి పరిశ్రమకు, ఆక్వాకు చేయూతనిస్తోంది. తద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు పేదలకు, సామాన్యులకు, మధ్య తరగతి వారికి, రైతులకు, మహిళలకు నేరుగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడంతోపాటు ఆర్థిక అసమానతలు తొలిగేలా బాపూ కన్న కలలను సాకారం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది.

గాంధీ కోరుకున్న స్వరాజ్యం ఇదే..



గాంధీ కోరుకున్న గ్రామ స్వరాజ్యం అంటే ఇదే. సచివాలయాల ద్వారా చాలావరకు ఇది నెరవేరింది. వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నారు. చిన్నచిన్న పనులకు మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ప్రజలు వ్యయ ప్రయాసలు పడాల్సిన అవసరం లేదు.

- ఉంద్రు బాబ్జి, ప్రైవేట్ అధ్యాపకుడు, అమలాపురం

ఈ మార్పులు ఊహించలేదు



గ్రామీణ విద్యలో ఈ మార్పులు ఊహించలేదు. నాడు-నేడులో పాఠశాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ఎంపీపీ పాఠశాలలతోపాటు జెడ్పీ ఉన్నత పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం అందించే భోజనం చాలా నాణ్యతతో బలవర్ధకంగా ఉంటోంది. మా పిల్లలు ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.

- గోశాల చిన దుర్గ, రాయవరం



దేశానికి గాని, జాతికి గాని సంఖ్యా బలం ఒక్కటే సరిపోదు... అందరూ ఉన్నత విద్యావంతులై ఆత్మగౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది. - డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

- అంబేడ్కర్ ఆశించిన అట్టడుగు వర్గాలకు అత్యున్నత విద్య దిశగా..
- నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, వసతి..విద్యా దీవెనలు

అంబేడ్కర్ ఆశయ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య, ఉన్నత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టింది. నాడు-నేడు ద్వారా పాఠశాలల స్వరూపం మార్చి వేసింది. జిల్లాలో తొలి విడతగా 436 పాఠశాలలను రూ.104.96 కోట్లతో ఆధునీకరించింది. నూతన భవనాలు, పాత భవనాలకు హంగులు, ఆధునిక బోర్డులు, బెంచీలు, మరుగుదొడ్లు ఇలా అన్ని సౌకర్యాలు కల్పించింది. రెండవ దశలో రూ.771 పాఠశాలలను ఎంపిక చేసి రూ.257 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు ఎనిమిది పాఠశాలల పనులు పక్కాగా పూర్తి కాగా, మిగిలిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

- మధ్యాహ్న భోజన పథకంలో పెనుమార్పులు తీసుకువచ్చారు. నాణ్యమైన భోజనం, ప్రతి రోజూ గుడ్డు, బలవర్ధకమైన ఆహారం అందించడంలో భాగంగా చిక్కీ, బెల్లంతో తయారు చేసిన రాగి జావ వంటివి అందజేస్తున్నారు.
- పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం వల్ల పేద, మధ్య తరగతికి చెందిన అన్ని సామాజిక వర్గాల వారికి మేలు జరిగింది. రూ.2,481 విలువైన యూనిఫామ్, బూట్లు, బ్యాగ్, పుస్తకాలను 1,14,833 మందికి అందించారు. అమ్మ ఒడి పథకం ద్వారా 1,38,883 తల్లుల ఖాతాలో రూ.208.24 కోట్లు జమ చేశారు. వీటితోపాటు ఉన్నత విద్యావంతులకు వసతి దీవెన కింద 33,344 మందికి రూ.31.74 కోట్లు అందజేయగా, విద్యాదీవెన పథకంలో 25,694 మందికి రూ.23.64 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేశారు. వీటితోపాటు విదేశీ విద్య వంటి పథకాలను అమలు చేస్తున్నారు.

37 మంది ఎస్‌ఈబీ సిబ్బందికి సర్వీస్ మెడల్స్



సర్వీస్ మెడల్స్ అందుకున్న వారితో ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం టౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)లో మూడేళ్ల సర్వీస్ పూరి చేసుకున్న జిల్లాలోని 37 మంది సీఐలు, ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ మెడల్స్ కేటాయించింది. జిల్లా ఎస్‌ఈబీ ఇన్‌చార్జి, జిల్లా ఏఎస్పీ (అడ్మిన్) ఎస్.ఖాదర్ బాషా స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బందికి సర్వీస్ మెడల్స్‌ను సోమవారం అందించారు. ఎస్‌ఈబీ రాష్ట్ర కమిషన్ ఎం.రవిప్రకాష్ జిల్లాలోని 37 మందిని సర్వీస్ మెడల్స్‌కు ఎంపిక చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్ఈబీకి చెందిన అయిదుగురు సీఐలు, అయిదుగురు ఎస్సైలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 24 మంది కానిస్టేబుళ్లకు ఏఎస్పీ ఖాదర్ బాషా ఆ మెడల్స్‌ను స్వయంగా అందించారు. అనంతరం వారితో గ్రూపు ఫొటో దిగారు.

జెండా పండగకు అంతా రెడీ

- 77వ స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు
- బాలయోగి స్టేడియంలో వేడుకలు

అమలాపురం రూరల్: జెండా పండగకు జిల్లా కేంద్రమైన అమలాపురం ముస్తాబయ్యింది. 77వ స్వాతంత్య్ర దినోత్సవం స్థానిక బాలయోగి స్టేడియంలో మంగళవారం జరగనుంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడిన తరువాత రెండో ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్ జెండా ఆవిష్కరించి, గౌరవ వందన స్వీకరణ చేయనున్నారు. ఏర్పాట్లపై కలెక్టర్ శుక్లా సమీక్ష జరిపారు. వేడుకులకు వచ్చే పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారిని తీసుకువచ్చేందుకు అవసరమైన మినీ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకలు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అగ్నిమాపక, విపత్తుల స్పందన విభాగం డెమో ప్రదర్శించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు ఫిజీషియన్‌తో మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బాలబాలికలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ శుక్లా సూచించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జిల్లాలోని వివిధ శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులతో ముఖ్య అతిథులకు ప్రసంగాన్ని రూపొందించాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, డ్వామా, డీపీవో, గృహ నిర్మాణ సంస్థ వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, దేవదాయశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పౌర సరఫరాల అధికారి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల శకటాలను సిద్ధం చేయాలని కలెక్టర్ శుక్లా సూచించారు.



బాలయోగి స్టేడియంలో వేడుకలకు సిద్ధమవుతున్న వేదిక



స్వాతంత్య్ర దినోత్సవానికి విద్యుత్ దీపాలతో ముస్తాబయిన కలెక్టరేట్

డీఆర్‌ఎంతో ఎంపీ భరత్‌రామ్ భేటీ

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలో డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్‌తో ఎంపీ మార్గాని భరత్‌రామ్ సోమవారం భేటీ అయ్యారు. నిడదవోలు, అనపర్తి నియోజకవర్గం కేశవరం ఎల్సీల వద్ద ఆర్వోబీల నిర్మాణం, అనపర్తి, నిడదవోలు స్టేషన్లలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, గోదావరి స్టేషన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైల్వే బోర్డు ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిందన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కోరినట్టు ఎంపీ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఖాళీ రైల్వే ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పున అభివృద్ధి చేయాలని కోరామన్నారు. డీసీఎం రాంబాబు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఉన్నారు.

జిల్లాలో 15మంది వార్డు సభ్యులు, ఒక సర్పంచ్ ఏకగ్రీవం

అమలాపురం రూరల్: జిల్లాలో 21 గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, రెండు సర్పంచ్ పదవులకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 15 మంది వార్డు సభ్యులు, ఒక సర్పంచ్ ఏకగ్రీవం అయ్యారని డీపీవో కృష్ణకుమారి తెలిపారు. గోడిలంక సర్పంచ్‌కు ఒక నామినేషన్ రావడంలో ఏకగ్రీవ అయిందన్నారు. రామచంద్రపురం మండలంలో ఓదురు సర్పంచ్ పదవితోపాటు వివిధ మండలాల్లో ఆరు వార్డు సభ్యులకు ఎన్నిక 19వతేదీన జరుగుతుందన్నారు. పోటీల్లో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించామన్నారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

● కాంతులీనిన వంతెన



రాజమహేంద్రవరంలోని గోదావరిపై హేవలాక్ వంతెన త్రివర్ణశోభను సంతరించుకుంది. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి రంగుల కాంతులతో మెరిసిపోతూ ఆకట్టుకుంది. జెండా రంగుల విద్యుద్దీప కాంతులు చీకటి వేళ గోదావరి నీటిలో ప్రతిబింబించాయి.

ఫొటో: సాక్షి రాజమహేంద్రవరం

పేదల పాలిట పెన్నిధి విద్యాబ్యాంకు

వినూత్న ఆలోచనతో పిల్లల అవసరాలు తీరుస్తున్న ఉపాధ్యాయుడు

కొత్తపేట : ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చింతా శ్యామ్‌కుమార్ విద్యా బ్యాంకును స్థాపించారు. ప్రవృత్తి రీత్యా ఇంద్రజాలికుడైన ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చదువు అంటే నాకు ఇష్టం (వుయ్ లవ్ రీడింగ్) అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంకల్పించాడు. సంపన్నుల వద్ద నుంచి నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, దేశ నాయకుల జీవిత చరిత్ర, వివిధ పోటీ పరీక్షల సామగ్రి, కథల పుస్తకాలు సేకరించి వాటిని పేద పిల్లలకు అందజేస్తున్నారు. ఈ ఏడాది జూలైలో విద్యాబ్యాంకు ప్రారంభించి ప్రతి ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యా పరికరాలను పంపిణీ చేస్తున్నారు. ఈ బ్యాంకు ద్వారా కోడి సతీష్, శరధ్వల్లారి, అన్నపూర్ణ, ఫిజియో థెరపీ వైద్యులు మోహిత్, వంటి 12 మంది దాతల నుంచి సేకరించామన్నారు. ఇప్పటి వరకు 800 మంది విద్యార్థులకు పలకలు, నాలుగు వేలమందికి 16 వేలు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశామన్నారు. అవసరాల పెట్టెను ఏర్పాటు చేసి బ్యాంకు ద్వారా విద్యార్థులకు అవసరమైన విద్యా పరికరాలు అందుబాటులో ఉంచుతున్నట్టు శ్యామ్ తెలిపారు. గ్రంథాలయం లేని ప్రాంతాలకు పుస్తకాలను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో తాను 2020 మే నెలలో సంచార గ్రంథాలయం ప్రారంభించినట్టు తెలిపారు. సుమారు 300 దేశ నాయకుల చరిత్ర, నీతి కథలు, వ్యక్తిత్వ వికాసం వంటి పుస్తకాలను అందులో ఉంచినట్టు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు స్థానిక మ్యాజిక్ హౌస్‌లో ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచి వాటిని చదువుకునే ఏర్పాటు చేశామన్నారు. సంచార గ్రంథాలయం ద్వారా విద్యార్థుల ఇంటి వద్దకే వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చదువు అంటే నాకు ఇష్టం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నామని చెప్పారు.



విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్యామ్



యశస్వీభవ

- కలల సాకారానికి పీఎం యశస్వీ
- 9, 10, ఇంటర్ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- దరఖాస్తుకు 17 వరకూ గడువు
- వచ్చే నెల 29న అర్హత పరీక్ష

రాయవరం: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం యశస్వి) పథకం అమలు చేస్తోంది. ఆర్థిక కారణాలతో మధ్యలోనే చదువు ఆపి, ఉపాధి బాట పట్టే విద్యార్థులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీ), ఆర్థికంగా వెనుకబడిన కులాలు (ఈబీసీ), నొమాడిక్ (సంచార), సెమీ నొమాడిక్ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే అవకాశముంది.

గత ఏడాది నుంచి..

పీఎం యశస్వి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రూపకల్పన చేసింది. ఇప్పటి వరకూ ఉన్న అతి పెద్ద ఉపకార వేతన పథకాల్లో ఇదొకటి. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పథకాన్ని నిర్వహిస్తోంది. 9, 10 తరగతుల విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారికి ఏడాదికి రూ.1.25 లక్షల మేర ఉపకార వేతనం ఒకేసారి ఇస్తారు. ఎంపికైన విద్యార్థి ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు ఈ మొత్తాన్ని నేరుగా జమ చేస్తారు. దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు సహా ప్రతి రాష్ట్రం నుంచి పరిమిత సంఖ్యలో ఈ పథకానికి ఎంపిక చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం మన రాష్ట్రంలో ఈ ఏడాది ఈ స్కాలర్‌షిప్‌లకు 1,401 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

మరో రెండు రోజులే..

దరఖాస్తు గడువు గత గురువారంతో ముగిసిపోగా ఈ నెల 17వ తేదీ రాత్రి 11.59 గంటల వరకూ గడువు పొడిగించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల 29న స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులు ఉపకార వేతనానికి అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటారో దాని పాస్‌బుక్ ఫొటో కాపీని జత చేయాలి. దరఖాస్తుదారులు ఒక్క నయాపైసా కూడా చెల్లించనవసరం లేదు. పూర్తి ఉచితంగానే దరఖాస్తు చేసుకుని పరీక్ష రాయవచ్చు.

ఇవీ అర్హతలు

- విద్యార్థి భారతీయుడై ఉండాలి.
- కేంద్ర విద్యా శాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- ప్రవేశ పరీక్షకు 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- 9, 10 తరగతుల పూర్తయిన వారు కూడా ఇంటర్ వరకూ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలు మించి ఉండకూడదు.
- **గ్రామాల్లో నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు** ప్రాధాన్యం ఇస్తారు.

పరీక్ష విధానమిదీ..

- **మూడు గంటల** పాటు పరీక్ష ఉంటుంది.
- **హిందీ, ఇంగ్లిష్** భాషల్లో నిర్వహిస్తారు.
- **మల్టిపుల్ చాయిస్** క్వశ్చన్ (ఎంసీక్యూ) విధా**నంలో ఓఎంఆర్ షీట్ల**పై పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- **గణితంలో 30 ప్ర**శ్నలకు 120 మార్కులు, 25 **ప్రశ్నలకు 100 మా**ర్కులు, సైన్స్‌లో 20 ప్రశ్నలకు 80 మార్కులు, జనరల్ అవేర్‌నెస్‌లో 25 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. దేశవ్యాప్తంగా 78 నగరాల్లో ఈ పరీక్ష జరుగుతుంది.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

- ఈ స్కాలర్‌షిప్ పొందేందుకు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.
- ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
- పేరు, ఈ-మెయిల్, అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితర వివరాలతో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి.
- అనంతరం దరఖాస్తుదారుకు అప్లికేషన్ నంబర్ వస్తుంది.
- అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి.
- చదువు, గుర్తింపు కార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ చేయాలి.
- దరఖాస్తు ఫారం పూర్తి చేసిన తర్వాత దాని కాపీ ప్రింట్ తీసుకొని దగ్గర ఉంచుకోవాలి.
- పరీక్ష, ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

మంత్రి రాజాకు పలువురి పరామర్శ



సత్యనారాయణమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జక్కంపూడి రాజా

తుని: మాతృ వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను పలువురు ప్రముఖులు పరామర్శించారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని మంత్రి నివాసంలో సోమవారం మంత్రి తల్లి సత్యనారాయణమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, గొల్ల బాబూరావు, చలమలశెట్టి సునీల్, బీజేపీ నాయకుడు చోడ్రాజు సత్యకృష్ణంరాజు నివాళులు అర్పించి, మంత్రి రాజాను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు మంత్రి రాజాను పరామర్శించారు.

బాపురే..!



అలమూరు: 212 మంది స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను నిక్షిప్తం చేస్తూ రూపొందించిన జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటం అబ్బుర పరుస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తూరు సెంటర్‌లోనున్న ఒక ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న యార్లగడ్డ రాజారావు మూడురోజుల పాటు శ్రమించి స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను సేకరించి ఈ చిత్రపటాన్ని రూపొందించారు. స్వాతంత్రోద్యమంలో పోరాడి అమరవీరులైన స్వాతంత్ర్య సమరయోధులను నేటి తరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ చిత్రపటాన్ని రూపొందించినట్టు ఆయన పేర్కొన్నారు.

పాముకాటుకు ఏడేళ్ల బాలిక మృతి



సుమశ్రీ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు శివారు జువ్విపాడులో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఏడేళ్ల బాలిక పొట్లకాయల సుమశ్రీ మృతి చెందింది. స్థానికులు, రామచంద్రపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పొట్లకాయల సూర్యమోహన్ రావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు నవ్యశ్రీ, సుమశ్రీలతో కలసి జువ్విపాడులో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి చిన్నమ్మాయి సుమశ్రీ మంచంపై పడుకుని ఏడుస్తుండటంతో తల్లి ఏమైందని అడిగింది. తన కుడి పాదం మధ్య వేలు వద్ద మంట వస్తోందని ఆ బాలిక తెలిపింది. పరిసరాల్లో ఏమైనా విషపు పురుగులు, పాముగాని ఉందేమోనని వెతకగా ఏమీ కనిపించలేదు. భర్త లారీ పని మీద పొరుగూరికి వెళ్లడంతో స్థానికుల సహకారంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి సుశీల ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారంతో రామచంద్రపురం అడిషనల్ ఎస్సై ఏవీ సీతారామాచార్యులు కేసు నమోదు చేశారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక వేళంగి సమీపంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. చలాకీగా ఉండే బాలిక మృతితో తల్లిదండ్రుల శోకాన్ని ఎవరూ ఆపలేకపోతున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రత్నగిరిపై ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం

- నేటి నుంచి అమలులోకి..
- గాజు, రాగి, స్టీలు, నాన్ ప్లాస్టిక్ 'బయో ఎలైట్' వాటర్ బాటిల్స్ విక్రయాలకు ఆదేశం
- 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ రూ.60
- ఖాళీ బాటిల్ తిరిగిస్తే రూ.40 వాపస్



అన్నవరం దేవస్థానం



బయో ఎలైట్ వాటర్ బాటిల్

అన్నవరం: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత ప్లాస్టిక బాటిల్స్ నిషేధించిన రెండో దేవస్థానంగా కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం చరిత్రలో మిగిలిపోనుంది. మంగళవారం నుంచి దేవస్థానంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం అమలులోకి రానుంది. ప్లాస్టిక్ బాటిల్స్ స్థానంలో గాజు వాటర్ బాటిల్స్, రాగి, స్టీలు, నాన్ ప్లాస్టిక్ 'బయో ఎలైట్' వాటర్ బాటిల్స్ మాత్రమే వినియోగించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలు జారీచేశారు. దేవస్థానంలోని అన్ని ఫ్యాన్సీ, కూల్‌డ్రింక్స్ షాపుల నిర్వాహకులు ఈ బాటిల్స్‌ని మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ బాటిల్స్ ఏ షాపులో ఉన్నా రూ.500 జరిమానా విధించాలని ఆదేశించారు. భక్తుల కోసం దేవస్థానంలో ఎనిమిది చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి అక్కడ గ్లాసులు కూడా ఉంచినట్టు తెలిపారు.

నేడు బయో ఎలైట్ నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్ ఆవిష్కరణ

రాష్ట్రంలోనే తొలిసారిగా హైదరాబాద్‌కు చెందిన 'బయో ఎలైట్' సంస్థ మొక్కజొన్న గింజల పొడికి రసాయనాలు కలిపి తయారు చేసిన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌ను మంగళవారం దేవస్థానంలో ఆవిష్కరించనున్నారు. ఈ బాటిల్‌ను రూ.40కి విక్రయించడానికి దేవస్థానం అనుమతి ఇచ్చిందని ఆ సంస్థ ఎండీ దిలీప్ తెలిపారు. ఈ వాటర్ బాటిల్స్ నాన్ ప్లాస్టిక్ అని రాష్ట్ర, కేంద్ర సంస్థలు ధ్రువీకరించిన విషయం విదితమే. ఈ బాటిల్‌ను మూడు నెలల వరకు వాడుకోవచ్చు అని తెలిపారు. తరువాత ఈ బాటిల్స్‌కు పగుళ్లు వచ్చి క్రమంగా వినియోగానికి పనికిరాకుండా పోతాయని ఆయన వివరించారు.

ద్వారకా తిరుమల దేవస్థానంలోనూ...

తూర్పుగోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానంలో బయో ఎలైట్ వాటర్ బాటిల్స్ విక్రయించేందుకు అవకాశం ఇవ్వాలని ఆ దేవస్థానం ఈఓ వి.త్రినాథరావును కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని దిలీప్ వివరించారు.

రూ.60కి 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ విక్రయం

అన్నవరం దేవస్థానంలో బయో ఎలైట్ నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌తో బాటు 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ ను రూ.60 కి అమ్మేందుకు అనుమతించారు. ఖాళీ గాజు సీసాను తిరిగి ఇస్తే రూ.40 వాపస్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాల నుంచి రూ.30వేలు మాయం

నల్లజర్ల: సైబర్ మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా నల్లజర్ల మండలం అనంతపల్లిలో ఇద్దరు బ్యాంకు ఖాతాల్లోని రూ.30,600 మాయమయ్యాయి. గ్రామానికి చెందిన మోటార్ మెకానిక్ దాసు రాజా ఖాతా నుంచి ఈ నెల 12,13 తేదీలలో రూ.20 వేలు కాజేశారు. అదే గ్రామానికి చెందిన రైతు బోయపాటి సుబ్బారావు ఖాతా నుంచి ఒక రోజు రూ.10వేలు, మరో రోజు రూ.600 కాజేశారు. ఖాతాను పరిశీలిస్తే ఆధార్ కార్డుతో వేలిముద్ర వేసి డబ్బు తీసుకున్నట్టుగా ఉందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. నెల రోజుల ముందు పాలవ్యాపారి గురుమిల్లి శ్రీనివాస్ ఖాతా నుంచి రూ.20వేలు లాక్కున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంకన్న ఆలయంలో విన్‌టేజ్ లైటింగ్ ప్రారంభం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి రోజు రోజుకు భక్తులు పెరుగుతున్నారని, తిరుమల తిరుపతి తరువాత వారంలో శనివారం అత్యధిక మంది భక్తులు విచ్చేసే దేవస్థానంగా ప్రభవిల్లుతోందని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. సోమవారం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) సహకారంతో రూ.41.70 లక్షలతో ఏర్పాటు చేసిన విన్‌టేజ్ లైటింగ్‌ను జగ్గిరెడ్డి, షర్మిలారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామన్నారు. సుమారు రూ.4 కోట్లతో ప్రాకార మంటపాల నిర్మాణం, ఆలయం చుట్టూ గ్రానైట్ వేయించడం, పార్కింగ్ ప్రాంగణం వద్ద రూ.55 లక్షలతో కల్యాణ ప్రాంగణం నిర్మాణం ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. ఇప్పుడు తిరుపతి మాదిరిగా ఆలయం ముందు ఉన్న చెరువును కోనేరుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ మ్యాచింగ్ గ్రాంట్ రూ 2.80 కోట్లు విడుదల అయ్యాయన్నారు. రూ 5.5 కోట్లతో నిర్మిస్తున్న అన్నదాన భవనం పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వాడపల్లి కొత్త బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డుకు విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటుకు రుడా సహకరిస్తోందన్నారు. వాడపల్లి ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, సర్పంచ్ పోచిరాజు సూర్యకుమారి, ఎంపీటీసీ సభ్యుడు ఏపుగంటివీరరాఘవులును అభినందించారు. రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పలశ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, , జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుకి త్రుటిలో తప్పిన ప్రమాదం



స్టీరింగ్ రాడ్డు విరిగిపోవడంతో అదుపు తప్పి బోదెలోకి వెళ్లిన బస్సు

అల్లవరం: అమలాపురంలోని భాష్యం విద్యా సంస్థకు చెందిన బస్సు కోడూరుపాడు వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. అమలాపురం నుంచి బయలుదేరిన బస్సు అల్లవరంలో కొంతమంది పిల్లలను దింపేసి తిరిగి కోడూరుపాడు వెళ్తుండగా ఆక్వా చెరువుల వద్ద స్టీరింగ్ రాడ్ విరిగి బస్సు అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న బోదెలోకి వెళ్లి వాలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 16 మంది విద్యార్థులు ఉన్నారు. స్థానికులు బస్సులో ఉన్న విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. విద్యార్థులు సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఏసీబీకి చిక్కిన ఎలక్ట్రికల్ లైన్‌మన్



ఏసీబీకి చిక్కిన లైన్‌మెన్ అల్లు తాతాజీ

శంఖవరం: మండలంలోని నెల్లిపూడి గ్రామంలో ఎలక్ట్రికల్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న అల్లు తాతాజీ రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు సైపిరెడ్డి శ్రీను పొలంలో విద్యుత్ కనెక్షన్ వేసేందుకు రూ.5 వేలు డిమాండ్ చేశాడు. దీంతో రైతు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రైతు నుంచి నగదు తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నట్లుగా తెలిపారు. బాధితుడిని కోర్టులో హాజరుపరస్తామని తెలిపారు. కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్లు వి.పుల్లారావు, డి.వాసు పాల్గొన్నారు.

ఎరువుల సీజ్

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెంలో విజిలెన్స్ అధికారులు సోమవాం తనిఖీలు చేపట్టారు. శ్రీ వెంకట మారుతి ఆగ్రో ఏజెన్సీస్ షాపులో తనిఖీలు చేయగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం, లైసెన్స్ ప్రదర్శించకపోవడం, స్టాక్ బోర్డు అప్‌డేట్ చేయకపోవడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో షాపులోని రూ.1,86,360ల విలువైన 6.8 మెట్రిక్ టన్నుల ఎరువులను వ్యవసాయాధికారి భార్గవ్ సీజ్ చేశారు. వ్యవసాయ, పోలీసు, తూనికలు కొలతల శాఖ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.